కొత్త పింఛన్లు లేనట్టేనా..?

నేటికీ తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్



మేడపాడు గ్రామ సచివాలయం

యలమంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు పూర్తవుతుంది. అయితే ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు సరికదా కనీసం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా 60 ఏళ్లు నిండిన వెంటనే వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయంలో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. పాలకొల్లు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లో సుమారు 1800 మంది అర్హులైన పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ తెరచుకోకపోవడంతో వారంతా ఆశగా ఎప్పుడు వెబ్‌సైట్ తెరుస్తారా అని ఎదురుచూస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురుచూపులే..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తుంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో? ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛను దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్లు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించినవారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

రెండు వందల రోజులైనా తెరుచుకోని సైట్..

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన పింఛన్ వెబ్‌సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 200 రోజులు అవుతున్నా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర..

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. పింఛన్ లబ్ధిదారులను సర్వే చేసి అనర్హత పేరుతో పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే, ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడం పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

వెలవెలబోయిన కోడిపందేల బరులు


పూలపల్లిలో షామియానాలను తొలగిస్తున్న దృశ్యం


పోలీసుల సమక్షంలో ఫెన్సింగ్ తొలగిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కోడిపందేలకు నాలుగో రోజు కూడా పోలీసులు అనుమతులు లభిస్తాయని నిర్వాహకులు ప్రచారం చేశారు. అనుమతులు వస్తాయనే ఉద్దేశంతో మూడో రోజు సాయంత్రం శిబిరాలను తొలగించలేదు. కొన్ని గ్రామాల్లో గురువారం ఉదయం కూడా పందేలు వేశారు. అయితే పది గంటలకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు అన్ని గ్రామాల్లో కోడి పందేల శిబిరాల వద్దకు చేరుకుని శిబిరాలను తొలగించారు. అలాగే పలువురుని బైండోవర్ చేశారు. మండలంలోని పూలపల్లిలో కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన కోడిపందేల శిబిరాన్ని పట్టణ పోలీసుల సమక్షంలో తొలగించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మాజీ ఎంపీటీసీ గోగులమండ విజయాదేవి పిలుపునిచ్చారు. జిన్నూరు పెదపేటలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక సంఘం, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి స్థానిక నాయకుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. స్థానిక బాలబాలికలకు, యువతకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయాదేవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతిఏటా పెదపేటలో క్రీడాపోటీలు నిర్వహించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ వడ్లపాటి శ్రీలక్ష్మి, వార్డుమెంబర్లు మేడిది నిర్మలకుమారి, కాటం రామదాసు, స్థానిక నాయకులు కాటం జయరాజు, గోగులమండ రత్నాజీ, పిల్లి పెంటయ్య, పీతల రామారావు, నల్లి దయానందం పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


బాధితులకు సహాయం చేస్తున్న తహసీల్దార్

యలమంచిలి: అగ్ని ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ఎప్పుడూ ముందుంటాయని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. వడ్డిలంక గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలకు బళ్ల కృపావరం చారిటీస్ సభ్యులు గురువారం దుస్తులు, పప్పు దినుసులు, బియ్యం బస్తా తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా ప్రభుత్వం తరపున తహసీల్దార్ బాధితులకు రూ.5 వేలు నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కేఎస్పీ కుమార్, బళ్ల మూర్తిరాజు, తోట ప్రత్యూష, సన్‌షైన్, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి


మార్టేరులో వాటర్ డీసీ చైర్మన్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుమంట్ర: రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత సాగునీటి సంఘాలదేనని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మార్టేరు వేణుగోపాల ఆడిటోరియంలో ఆచంట నియోజకవర్గంలోని వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, సాగునీటి సంఘాల అధ్యక్షుల అభినందన సత్కార సభను మార్టేరు డీసీ చైర్మన్ జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పితాని మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడంలో సాగునీటి సంఘాలు అధ్యక్షులతో పాటు డైరెక్టర్లు కూడా తనవంతు సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పెనుమంట్ర, మార్టేరు, సిద్ధాంతం, వాటర్ డీసీ చైర్మన్‌లు వెలగల బుల్లిరామిరెడ్డి, జక్కంశెట్టి సత్యనారాయణ, తమ్మినేడి ప్రసాద్, పలువురు సాగునీటి సంఘ అధ్యక్షులను సత్కరించారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, వివిధ గ్రామాల సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కళాకారుడు సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న అభినయ శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణానికి చెందిన నటుడు, కళా పరిషత్ నిర్వాహకుడు, గుణనిర్ణేత మానాపురం సత్యనారాయణను అభినయ రంగస్థల పురస్కారం-2025 ప్రదానం చేశారు. గుంటూరు జిల్లా పొనుగుపాడులో నిర్వహించిన 18వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు అభినయ నాట పరిషత్ ప్రధాన సలహాదారుడు, నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. నాటిక పరిషత్ నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల, చింతపర్రు, వడ్లవానిపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.3.30 కోట్లకు సంబంధించి సీసీ రోడ్లు, డ్రెయినేజీ, వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, సర్పంచ్‌లు కందుల వెంకటేశ్వరరావు, గుమ్మాపు పెద్దిరాజు, పెన్మెత్స పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సదస్సుకు హాజరుకావాలి

ఉండి: ఆకివీడు మండలం ధర్మపురం అగ్రహారం బాప్టిస్టు చర్చిలో ఈ నెల 29న నిర్వహించే నియోజకవర్గ పాస్టర్ల సదస్సులో ఉండి మండలంలోని యుపీఏ(యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్) సభ్యులంతా హాజరుకావాలని ఉండి మండల యుపీఏ అధ్యక్షకార్యదర్శులు సోడాదాసి పీటర్,వై యోనాతాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల వెంకటశ్రీనివాసరాజు(సుభాష్) చెప్పారు. జనవరి 24వ తేది నుంచి మూడు రోజులు నిర్వహించే ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్స్‌ను గురువారం ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను తెలిపారు.

జాతరను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

భీమవరం: గ్రామ శాంతి కోసం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఏర్పాటు చేసిన పండుగలు, జాతరలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు అన్నారు. పట్టణంలోని గునుపూడి గ్రామ దేవతలు శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి 34వ జాతర మహోత్సవం ఈ నెల 19వ తేదీ నుండి 26 వరకు ఆదిలక్ష్మి రజక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర ఉత్సవాల పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేప్పే విధంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ జాతరలో ఉభయ తెలుగురాష్ట్రాల్లో పేరు గాంచిన 400 మంది కళాకారులు పాల్గొంటున్నారని 19వ తేదీ గ్రామోత్సవంతో ప్రారంభమై 21వ తేదీ ప్రభోత్సవం, 23వ తేదీ సన్నాయి వాయిద్యాలు, ఆసాదుల గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బుట్ట బొమ్మలు, కోయ డాన్స్‌లు, అఘోరాల ప్రదర్శనలు, శక్తి వేషాలతో సోమగుండం చెరువు చుట్టూ మహా జాతరగా ప్రదర్శిస్తారని, 26న అఖండ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణ, రజక యూత్ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సుబ్బయ్య, నేదునూరి గంగాధర్ తిలక్, గరగపర్తి మల్లేశ్వరరావు, పరశురాం పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడికి రూ. 10 వేల జరిమానా

తణుకు అర్బన్: బెల్ట్ షాపు నిర్వాహకుడికి ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందరరాజు రూ.10వేలు జరిమానా విధించారు. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మురాల చిన్ని ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తూ గతంలో పట్టుబడిన మురాల చిన్ని అనే వ్యక్తిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో హాజరపరచగా బెల్ట్ షాపులు నిర్వహణ తదితర నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటానని అతని నుంచి గతంలో సత్ప్రవర్తన కోసం 1 సంవత్సర కాలానికి బాండ్ తీసుకున్నారు. అయితే అతను రాసిచ్చిన సత్ప్రవర్తన బాండును ఉల్లంఘిస్తూ ఈ నెల 2న అనధికారికంగా మద్యం విక్రయిస్తూ 6 మద్యం బాటిల్స్‌తో తిరిగి తణుకు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. సదరు నిందితుడు చిన్ని సత్ప్రవర్తన బాండ్లను ఉల్లంఘించి అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహించినందు వల్ల జరిమానా విధించినట్లు తెలిపారు. సదరు జరిమానాను నిందితుడు బుధవారం రూ.10వేలు చలానా రూపంలో చెల్లించారు.

ముమ్మరంగా గోకులం షెడ్ల నిర్మాణాలు

ఉపాధి హామీ పథకంతో చేయూత


కేపీ పాలెం సౌత్‌లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డు


పేరుపాలెంలో నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫారమ్ షెడ్

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గోకులం షెడ్లు, కోళ్ల ఫారాలు, మేకల పెంపకానికి షెడ్లు ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తుంది. రైతులతో షెడ్లు ఏర్పాటు చేయించడంతో పాటు రాయితీ ఖర్చులను భరిస్తుంది. దీనిలో భాగంగానే మొగల్తూరు మండలంలో 39 గోకుల షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు పశువల యజమానులు ముందుకు రాగా ఇప్పటి వరకు 12 షెడ్లు పూర్తయ్యాయి. రానున్న రోజుల్లో కోళ్ల ఫారాలు, మేకలు ఉంచేందుకు షెడ్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే గత రెండు, మూడేళ్లగా తోటల పెంపకంతో పాటు గోకులంషెడ్లు ఏర్పాటుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

షెడ్ల నిర్మాణానికి సాయం ఇలా

ఉపాధి హామీ పథకంలో గోకులం షెడ్లకు 2 పశువులుంటే రూ.1.15 లక్షలు, 4 పశువులుంటే రూ.1.85 లక్షలు, 6 పశువులుంటే రూ.2.30 లక్షలు మంజూరు చేస్తారు. అయితే ఈ మొత్తం ఖర్చులో రైతు 10 శాతం భరిస్తే, ఉపాధి హామీ పథకంలో 90 శాతం చెల్లిస్తారు. అదే విధంగా కోళ్ల ఫారాలకు 100 కోళ్లు ఉంటే రూ.87 వేలు, 200 కోళ్లు ఉంటే రూ.1.32 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నారు. కోళ్ల షెడ్ల నిర్మాణానికి ముందుకువస్తే రైతు 30 శాతం భరిస్తే, ఉపాధి హామీ పథకంలో 70 శాతం అందిస్తారు. అలాగే మేకలు 20 ఉంటే రూ.1.30 లక్షలు 50 ఉంటే రూ.2.30లక్షలు మంజూరు చేస్తారు. దీంట్లో రైతు 30 శాతం భరిస్తే ఉపాధి హామీ పథకంలో 70 శాతం చెల్లిస్తారు. అంతే కాక రైతులకు సొంతంగా 50 సెంట్ల స్థలం ఉంటే పశు గ్రాసం పెంచుకునేందుకు రూ.32,992 అందిస్తామని అధికారులు చెబుతున్నారు. గోకులం షెడ్ల ఏర్పాటుపై గ్రామాల్లో రైతులకు, పశు యజమానులకు, మేకలు, కోళ్ల పెంపకందారులకు అవగాహన కలిప్పస్తున్నామని అధికారులు తెలిపారు.

తోటల పెంపకంపై ఆసక్తి :

మొగల్తూరు మండలంలో నీటి వసతి పూర్తిస్థాయిలో ఉండటంతో తోటల పెంపకంపై కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొగల్తూరు మండలంలో కొబ్బరి 67 ఎకరాలు, మామిడి 63 ఎకరాల్లోను పెంచేందుకు రైతులు కృషి చేస్తున్నారు. వీటితో పాటు మునగ, దానిమ్మ, సపోటా, జామ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, ఎకరా నుంచి ఐదు ఎకరాలు వరకు తోటల పెంపకం చేపడితే సబ్సిడీలను అందిస్తామని చెబుతున్నారు.


నరసాపురం రూరల్: పిప్పళ్లవారితోటలో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు


పెనుగొండ: సిద్ధాంతం హైస్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

నరసాపురం రూరల్: పేద విద్యార్థులకు చేయూతనిస్తూ సేవాకార్యక్రమాలు ముమ్మరం చేయాలని పూర్వ విద్యార్థులంతా నిర్ణయం తీసుకున్నారు. గురువారం మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయితీ పిప్పళ్లవారితోట ఉన్నతపాఠశాల 2006-07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు స్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. పిప్పళ్ల రాజేష్, శిరిగిసీడి రత్తయ్య, తణుకుల నరేష్, కందుల పాటి శ్రీనివాసు, ఆకన కిషోర్ పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: చదువు నేర్పిన చదువుల తల్లి ఒడిలో 25 ఏళ్ల తరువాత ఆనాటి చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ గురువారం సిద్ధాంతం హైస్కూలు 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. వారంతా 25 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో చిన్నానాటి స్నేహితులను చూసి మురిసిపోయారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుని, వివిధ ఆటలపోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూలు అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని, తమ బ్యాచ్‌లో పూర్వవిద్యార్థుల్లో ఎవరైనా కష్టాల్లో ఉంటే వారికి సాయపడాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో బ్యాచ్ విద్యార్థుల్లో ఒకరైన సర్పంచ్ చింతపల్లి గనిరాజు, చిట్టూరి నాగరాజు, పాలూరి పోతురాజు, కంచర్ల సుబ్రహ్మణ్యం, సరెళ్ల సురేష్, బందారు దుర్గాదేవి, ఎం.రేవతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

19న ముత్యాలమ్మ జాతర


ముత్యాలమ్మ పాక వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 19న నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నాడు ముక్కనమ వెళ్లే మరసటి బుధవారం లేదా ఆదివారం నాడు అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన ఆడపడుచులు, గ్రామస్తులు అమ్మవారి జాతరలో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం సంప్రదాయంగా వస్తుంది. దీంతో అమ్మవారి ఘటాలను ఉంచే పూరిపాక పరిసరాలను విద్యుత్ దీపాలంకరణతో పాటు చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా గోగులమ్మ జాతర


చింతపల్లివారితోటలో గోగులమ్మ జాతర గరగలతో నృత్యాలు చేస్తున్న దృశ్యం

మొగల్తూరు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రతి ఏటా నిర్వహించనట్లుగానే ఈఏడాది కూడా రామన్నపాలెం గోగులమ్మ వారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. రామన్నపాలెం పంచాయతీ ఆకనవారితోట చింతపల్లివారితోటలో ఉన్న గోగులమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆదర్శనీయుడు కొండేటి


మాజీ ఎంపీపీ కొండేటి రామకృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సుదీర్ఘకాలం పాటు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధిగా పనిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన మాజీ ఎంపీపీ కొండేటి రామకృష్ణారావు దంపతులు ఆదర్శనీయులని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. గురువారం మండలంలోని వేములదీవిలో గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో కొండేటి దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కొత్తపల్లి మాట్లాడుతూ కొండేటి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకల సతీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


చింతపర్రులో అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలిస్తున్న సీహెచ్ ఇందిర

పాలకొల్లు అర్బన్: అంగన్‌వాడీ చిన్నారులకు ఇంటిని మరిపించేలా ఆట, పాటలతో కూడిన విద్యాబోధన అందిస్తూ వారికి రుచికరమైన భోజనాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర సూచించారు. మండలంలోని చింతపర్రు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇందిర సందర్శించి రికార్డులు పరిశీలించారు. అలాగే కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులను పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, అంగన్‌వాడీ టీచర్ జీవీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వేల్పేరు గ్రామాల్లో కోడిపందేలపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వీరంపాలెం గ్రామ శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇరువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ పోలీసులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, చినతాడేపల్లి శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు వివరించారు.